# మునిసిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

**అక్టోబర్** 4వ తేదీనుండి రాష్ట్రవ్యాపితంగా మునిసిపాలిటీలన్నింటిలో పారిశుద్ధ్య కార్మికులు నిరవధిక ఆందోళన సాగిస్తున్నారు. తమ ఉపాధికున్న కనీసపాటి భద్రతను కూడా తొలగించివేసే జీవో నెం. 279ని తక్షణం ఉపసంహరించాలని వారంతా ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. మునిసిపల్ కార్మికులను కాంట్రాక్టర్ల దయాదాక్షిణ్యాలకు వదిలివేసే 279 జీవో రద్దుతోపాటు పనిభారానికనుగుణంగా కార్మికుల్ని నియమించాలని, పెరుగుతోన్న ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని, మురుగును శుభ్రం చేసే కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, చేతులకు, కాళ్ళకు తొడుగులు, తగిన వైద్య సౌకర్యం, మురుగు గొట్టాలలో దిగి పనిచేసే వారికి రక్షణలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

న్యాయమైన మున్సిపల్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించే బదులు తెలుగుదేశం ప్రభుత్వం పోటీ కార్మికులను రంగంలోకి దించి సమ్మెను నీరుగార్చజూస్తోంది. సమ్మెచేస్తున్న కార్మికులపై నిర్బంధం ప్రయోగించి, వేధింపులకు, బెదిరింపులకు గురిచేస్తోంది. నగరాలలో చెత్త పేరుకుపోయి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కల్గిస్తున్నా, అనారోగ్యం, జ్వరాలు ప్రబలుతున్నా ప్రభుత్వం మొండివైఖరి ప్రదర్శిస్తోంది. ప్రజలను కార్మికులపైకి ఉసిగొలిపే అనైతిక పద్ధతులకు పాల్పడుతోంది. 279 జీవో అమలుద్వారా ప్రజలపై యూజర్ ఛార్జీల వడ్డన అధికమౌతోందనే విషయాన్ని దాచివుంచి, ప్రభుత్వం ఇప్పటికైనా దిగివచ్చి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, 279 జీవో రద్దుచేయాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్‌చేస్తూ, పోరాడుతున్న కార్మికులకు 'జనశక్తి' సంఘీభావాన్ని ప్రకటిస్తోంది.

ooo